నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అల్లాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మరమ్మతు పనుల కారణంగా శనివారం అల్లాపూర్‌లోని పలు కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి 9 గంటల వరకు 11 కేవీ పర్వత్ నగర్ ఫీడర్ పరిధిలోని పర్వత్ నగర్ ఆటో స్టాండ్, పర్వత్ నగర్ శ్మశానవాటిక పరిసరాలు, పర్వత్‌నగర్ హనుమాన్ టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఎస్వీఐ కాలనీ ఫీడర్ పరిధిలోని సూర్య, రామరాజు గెస్ట్ హౌజ్, విష్ణువిస్తార, ధోబీఘాట్ ప్రాంతాల్లో, ఉదయం 8:30 నుంచి 9 వరకు పద్మావతినగర్ ఫీడర్ పరిధిలోని జేకే పాయింట్ హోటల్ పరిసరాలు, రాణాప్రతాప్‌నగర్, రాధా కృష్ణ సొసైటీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉందని తెలిపారు.

విజయనగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ విజయనగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌కు విన్నవించారు. దీనికి స్పందించి ఆయన శుక్రవారం కాలనీ వెల్ఫేర్ సభ్యులతో కలిసి కాలనీలో పాదయాత్ర చేసి సమస్యలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విజయనగర్ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు ఇదివరకే నిర్మించామని, పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కాలనీలో సమస్యలు త్వరగా పరిష్కరించాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ మోహన్, కె.రఘుపతిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి. హనుమంతారావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్, శ్రీధర్, ఏఈ శ్రావణి, వర్క్ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఆర్‌పీ నాగేశ్వర్‌నాయక్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు, ఎస్ఎఫ్ఏ సుదర్శన్, నరేందర్ పాల్గొన్నారు.


యూజీడీ పనులను శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ సతీష్‌గౌడ్

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

ఫతేనగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్‌లో డ్రైనేజీ సమస్యలుంటే తన దృష్టికి తేవాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ప్రజలకు సూచించారు. డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో రూ. 9 లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో నిధులు మంజూరు చేయించుకుని పనులు చేపడుతున్నామన్నారు. వర్షాకాలం దృష్ట్యా నాలా రిటర్నింగ్ వాల్ కోసం ఎస్టిమేషన్ సిద్ధం చేయిస్తున్నట్లు ఆయన డివిజన్ ప్రజలకు హామీ ఇచ్చారు. జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్, రాముముదిరాజ్, వెంకటేశ్, సుబ్బారాయుడు, విద్యాసాగర్, నర్సయ్య, శ్రీనివాస్, కీర్తి, విజయలక్ష్మి పాల్గొన్నారు.


కాంగ్రెస్ నాయకులతో సమావేశమైన సునీతారెడ్డి

ప్రజాసమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తా

కూకట్‌పల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ.. నిత్యం ప్రజలతో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తెలిపారు. కూకట్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులతో శుక్రవారం ఆమె తన నివాసంలో సమావేశమై మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను బీజేపీ వైపు మళ్లించేలా చేయడంతోనే తాను ఓటమిపాలయ్యానని చెప్పారు. ఆరు గ్యారెంటీలను అర్హులైన వారందరికీ అందేలా కృషి చేయాలని నాయకులకు సూచించారు. నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కె.రమేష్, రజిత, జోజమ్మ, అరవింద్‌రెడ్డి, మేకల మైఖేల్, అబ్దుల్ బాకీ, శేఖర్, శైలేష్‌యాదవ్, పొడుగు అప్పారావు, ఫణికుమార్, రాజేందర్, రవికుమార్, సుకన్య, రేణుక పాల్గొన్నారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి


బడిబాట కార్యక్రమంలో బాలానగర్ హైస్కూల్ హెచ్ఎం అరుణ్‌జ్యోతి, ఉపాధ్యాయులు

బాలానగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు పునాదులు వేయాలని బాలానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ్‌జ్యోతి సూచించారు. ఈనెల 3 నుంచి చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాలానగర్‌లో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 13తో బడిబాట కార్యక్రమం ముగుస్తుందన్నారు. బడిబాటకు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోందని ఆమె తన సంతృప్తిని వ్యక్తం చేశారు.

కల్యాణం.. కమనీయం


శ్రీవారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీవారి కల్యాణం శుక్రవారం అత్యంత వైభోవంగా నిర్వహించారు. సర్దార్‌పటేల్‌నగర్‌లోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన శ్రీవారి కల్యాణం తిలకించేందుకు భక్తజనం అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం కనులారా వీక్షించి భక్తితో పరవశించిపోయారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలి'

షాపూర్‌నగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ పలు ప్రైవేట్ బడులు, ముఖ్యంగా కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయి. 2024- 2025 విద్యా సంవత్సరంలో కొన్ని పాఠశాలలు ఏకంగా 25 శాతం భారం మోపుతున్నాయి. కొన్ని కార్పొరేట్ పాఠశాలలు 40-50 శాతం భారం మోపుతున్నాయి. 15ను తర్వాత నిర్ణయిస్తాయని తెలుస్తుంది. ప్రభుత్వం స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పెంచుతున్న ఫీజులను నియంత్రించి భారం తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తా


కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కాలనీవాసులు

నిజాంపేట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి పలు శాఖల అధికారులతో మాట్లాడి సమస్య లను పరిష్కరిస్తానన్నారు.

డెకాయ్ ఆపరేషన్లతో పోకిరీల భరతం

- 15 రోజుల్లో 76 మందిని పట్టుకున్న షీటీమ్స్
- పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు


రాచకొండ సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాచకొండ షీటీమ్స్ సిబ్బంది మహిళలను వేధిస్తున్న పోకిరీల భరతం పడుతున్నారు. గడిచిన 15 రోజుల్లో 76మందిని అదుపులోకి తీసుకున్న షీటీమ్స్ వారిపై కేసులు నమోదు చేశారు. వారిలో 20మంది మైనర్లు కూడా ఉండటం గమనార్హం. బహిరంగ ప్రదేశాల్లో ప్రేమపేరుతో యువతుల వెంటపడుతూ, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వారిని డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిని శుక్రవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి ఉషా విశ్వనాథ్ తెలిపారు. మే 1 నుంచి 15 వరకు 101 ఫిర్యాదులు అందాయని వాటిపై విచారణ జరిపి 76మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో లైంగిక వేధింపులకు పాల్పడిన 11 మందిపై క్రిమినల్ కేసులు, 47మందిపై పెట్టీ కేసులు నమోదు చేశామని, మిగతా వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించామని తెలిపారు. స్నానం చేస్తుండగా వీడియో తీసి, లైంగిక వేధింపులకు పాల్పడడంతో పాటు డబ్బు డిమాండ్ చేసిన యువకుడిపై, ప్రేమపేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపామన్నారు. అంతేకాకుండా మే 1 నుంచి 15 వరకు రాచకొండ షీటీమ్స్ ఆధ్వర్యంలో 30 ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు 4,425 మందికి మహిళా చట్టాలు, హక్కులు, నేరాల గురించి ఫిర్యాదు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- సీపీ తరుణ్ జోషి

మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నాం. బాలికలను, మహిళలను వేధించే వారిని విడిచిపెట్టే ప్రసక్తి లేదు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచి, విచారణ జరుపుతాం కాబట్టి, ఎవరైనా వేధింపులకు పాల్పడితే వెంటనే నిర్భయంగా ఫిర్యాదు చేయండి. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్, మెట్రోస్టేషన్, స్కూల్, కాలేజీ, మార్కెట్ వంటి బహిరంగ ప్రదేశాల్లో షీటీమ్స్ మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నాయి. స్వయంగా ఫిర్యాదు చేయడానికి రాలేని వారు ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేష్

భవన నిర్మాణ సంఘ భవనం కోసం ఉద్యమించాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంఘ భవనం కోసం అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసురత్నం అన్నారు. శుక్రవారం రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్ పారిశ్రామికవాడలో భవాని శ్రమశక్తి కార్మిక సంఘం జర్నల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం ఆ సంఘం అధ్యక్షుడు బాలా అధ్యక్షతన జరుగగా ఏఐటీయూసీ ప్రకాశం జిల్లా నాయకులు బాలకోటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసురత్నం, సీపీఐ కార్యదర్శి ఉమామహేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరై భవన నిర్మాణ కార్మిక జెండాను బాలకోటయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన హక్కుల సాధన కోసం అందరూ కలిసికట్టుగా పని చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. స్వామి, శ్రీనివాస్, రాములు, బాబు, భవన నిర్మాణ సంఘం నాయకులు రవి, సామెల్, మోహన్‌రావు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం - గంటలోనే అప్పగింత



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

బాలానగర్: ఆడుకుంటానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లిన బాలుడు అదృశ్యమయ్యాడు, గురువారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే ఫిర్యాదు అందిన గం టలలోనే బాలానగర్ పోలీసులు బాలుడి ఆచూకీ కనిపెట్టారు. వివరాల్లోకి వెళితే.. ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసముండే ఎలిమినేటి రాజశేఖర్‌రెడ్డి కుమారుడు కల్యాణ్‌రెడ్డి(10) గురువా రం సాయంత్రం 7.30 ని.లకు ఆడుకుంటానని సైకిల్‌ను తీసుకుని వెళ్లాడు. రాత్రి 9 దాటిన బాలుడు ఇంటికి రాలేదు. దీంతో బాలుడి తండ్రి రాజశేఖర్‌రెడ్డి బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సీఐ నవీన్‌కుమార్ సిబ్బందిని అప్రమత్తం చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా గాలింపు చేపట్టారు. బాలుడు గండిమైసమ్మ వైపు సైకిల్‌పై వెళ్తున్నట్లు గుర్తించి బాలుడిని కనిపెట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించి శుక్రవారం ఉదయం బాలుడిని వారి తల్లి దండ్రులకు అప్పగించారు. బాలుడి ఆచూకీ కనిపెట్టినందుకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మృగశిర కార్తె..

కొనుగోలుదారులతో చేపల మార్కెట్ కిటకిట


చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ముషీరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా ముషీరాబాద్ చేపల మార్కెట్ కిటకిటలాడింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే అమ్మకాలు కొనసాగాయి. సాధారణ రోజులకంటే అధికంగా చేపలు దిగుమతి అయ్యాయి. బొచ్చె, రవ్వ చేపల ధరలను ప్రతిరోజు కన్నా రూ. 10 నుంచి 20 రూపాయలకు అధికంగా విక్రయించారు. కిలో చేపలు రూ. 120 నుంచి 130 పలికాయి. సాధారణ రోజుల్లో కిలో రూ. 400 నుంచి 450 రూపాయలు ఉండే కొర్రమీను మృగశిర కార్తె సందర్భంగా రూ. 500 నుంచి 550 రూపాయలకు విక్రయించారు. చేపలను శుభ్రం చేసి ముక్కలు చేసే వారికి సైతం మార్కెట్‌లో డిమాండ్ విపరీతంగా పెరిగింది. శనివారం చేప ప్రసాదం పంపిణీ చేస్తుండడంతో ప్రజలు పెద్దఎత్తున చేపలు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. శుక్రవారం అమ్మకాలు కొంత తగ్గాయన్నారు.

ఇగ్నోలో డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ కాస్ట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్

హైదరాబాద్ సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయాన్ని పెంచేందుకు డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అనే కొత్త ప్రోగ్రామ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అడ్మిషన్లు తీసుకుంటామని ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ బి.రాజగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇగ్నోకు చెందిన స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్(ఎస్ఓఏ), ఐసీఎంఏలు కలిసి ఈ ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేశాయని, వ్యవసాయ రంగంలో ఉన్న వివిధ రకాల వనరుల, రైతులు తమ ఆదాయాన్ని మెరుగుపర్చుకోవడానికి దేశంలో అమల్లో ఉన్న వివిధ రకాల జాతీయ పథకాలను గురించి తెలియజేస్తుందని తెలిపారు. ఈ ప్రోగామ్‌లో ఇంటర్ అర్హతతో చేరవచ్చని, ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందడానికి అవకాశం కల్పించామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్‌ను, లేదా 9492451812 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాలకృష్ణను కలిసిన టీడీపీ నాయకులు


బాలకృష్ణతో ఎస్.ఎస్.రాజు, టీడీపీ నాయకులు

కూకట్‌పల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత నగరానికి వచ్చిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను కూకట్‌పల్లికి చెందిన టీడీపీ రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు గురువారం రాత్రి కలిశారు. శంషాబాద్ విమానాశ్రయంలో బాలకృష్ణకు ఘన స్వాగతం పలకడంతో పాటు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతూరి వెంకట్రావ్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు ఎస్.ఎస్.రాజు పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న నాయకులు

ఎన్డీఏ గెలుపుపై సంబరాలు

హైదర్‌నగర్: ఎన్డీఏ కూటమి విజయం సాధించడం పట్ల కిందికుంట వాకర్స్ అసోసియేషన్ సీతారాం, కొండపల్లి మాస్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి సీతారామరాజు మాట్లాడుతూ మళ్లీ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ముందుకెళ్తుందని తెలిపారు. భాజపా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశం

గాజులరామారం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పండుగలు శాంతి భద్రతలతో జరుపుకోవాలని సూరారం సీఐ వెంకటేశం అన్నారు. సూరారం పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో కలిసి శుక్రవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోయే బకీద్ పండుగను ముస్లింలు శాంతియుతంగా జరుపుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా పండుగలను నిర్వహించారుకోవాలని సూచించారు. వచ్చేది పండుగల సీజన్ కావడంతో హిందువులు, ముస్లింలు ఐక్యమత్యంగా ఉంటూ పండుగలను నిర్వహించుకోవాలి. ప్రశాంతంగా జరుపుకొని చట్టాలను గౌరవించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా, ఏమైనా సమస్యల తలెత్తినప్పుడు వివరిస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేష్, మల్లేశం, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ ఏసీపీ హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, పదయ్య తదితరులు
- హైదర్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి)

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని..

దుండిగల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు సెలబ్రేషన్స్ చేసుకుంటూ బాణాసంచి కాల్చి హంగామా చేసి, తమపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని శంభీపూర్ గ్రామానికి చెందిన క్యాసారం చంద్రశేఖర్ దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శంభీపూర్ గ్రామంలో ఈనెల 4న కొంత మంది చంద్రశేఖర్‌పై దాడి చేసి ఎక్సకవేటర్‌తో ఇంటి ముందు హంగామా సృష్టించి వాహనాలను ధ్వంసం చేసిన క్యాసారం శ్రీనివాస్, క్యాసారం గణేష్, క్యాసారం హన్మంత్, క్యాసారం రాజు, అతీష్‌బాబు, ఇతరులతో పాటు మరో పది మందిపై కేసు నమోదు చేసి, చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని క్యాసాని చంద్రశేఖర్ దుండిగల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కూకట్‌పల్లి కోర్టులో మెగా లోక్‌అదాలత్ నేడు

నిజాంపేట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేది శనివారం కూకట్‌పల్లి కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు ఉన్న వారు సత్వర పరిష్కారం కోసం కూకట్‌పల్లి కోర్టులో హాజరు కావాలని తెలిపారు. ఎలాంటి ఫీజు ఉండవని బాచుపల్లి పోలీసులు తెలిపారు.

వర్షాకాలం ప్రమాదాలు - జాగ్రత్తలపై అవగాహన

- రేపు ఈవీడీఎం ఆధ్వర్యంలో శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నగరంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. తెరిచిన మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లలో పడటం.. విద్యుత్‌షాక్.. నాలాల్లో ప్రమాదవశాత్తు పడిపోవడం.. చెట్లు.. కొమ్మలు విరిగిపడడంతో కొన్నిసార్లు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో వర్షం పడినప్పుడు జాగ్రత్తగా ఉండడం ఎలా..? ప్రమాదాల బారిన పడకుండా ఎలా కాపాడుకోవాలి..? అత్యవసర పరిస్థితుల్లో ఏం చేయాలి..? అన్న దానిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఈవీడీఎం) ఆధ్వర్యంలో బస్తీ వాసులు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 9వ తేదీన ఫతుల్లగూడలోని ట్రైనింగ్ సెంటర్‌లో వర్షాకాలం ప్రమాదాలు-జాగ్రత్తలపై అవగాహన, సమాచారంపై విపత్తుల నిర్వహణ విభాగం శిక్షణ ఇవ్వనుంది. వర్షం పడినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ఎవరికి సమాచారం ఇవ్వాలి..? ఏం చేయాలి..? అన్న దానిపై అవగాహన కల్పించనున్నారు. బస్తీవాసులు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకుకే శ్యాంసుందర్‌రెడ్డి (ఎస్ఎఫ్ఓ)ను 7981775687లో సంప్రదించాలని సూచించారు.

టెన్నిస్ రన్నరప్‌గా సంజన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అమ్మాయి సంజన సిరిమల్ల ఫైనల్లో ఓడి, రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం శామీర్‌పేట్‌లోని యాష్ టెన్నిస్ అకాడమీలో జరిగిన ఫైనల్లో సంజన 3-6, 1-6తో సొనాల్ (మహారాష్ట్ర) చేతిలో ఓడింది. సెమీస్‌లో 6-2, 6-1తో శైలీట కుర్‌పై గెలిచి ఫైనల్‌కు చేరుకుంది.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

పేట్‌బషీరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఓ కిరణాషాపు బయట రంగులు వేసేందుకు బోర్డును తొలగిస్తుండగా ప్రక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగిలి పెయింటర్ మృతి చెందాడు. మెదక్ జిల్లా , మద్వెల్ గ్రామానికి చెందిన శ్రీపతి పరవయ్య(46) బతుకు దెరువు కోసం కుటుంబసభ్యులతో వలస వచ్చి పద్మానగర్‌లోని కళావతి ఇంట్లోనే ఉంటూ పెయింటింగ్ పని చేస్తుంటాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజు మాదిరిగానే శుక్ర వారం పెయింటింగ్ వేయడానికి పద్మానగర్, ఫేజ్-2 రింగ్ రోడ్డు వద్ద గల కిరాణాషాపు వద్దకు వెళ్లాడు. కిరణాషాపు ముందు ఉన్న రేకులపైకి ఎక్కి షాపు బోర్డును తీస్తుండగా ప్రక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు బోర్డు తగిలి శ్రీపతి పరవయ్య క్రిందపడ్డాడు. పేట్‌బషీరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

హత్య కేసులో ఒకరికి పదేళ్ల జైలు


చిట్టిబాబు

కూకట్‌పల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో ఓ వ్యక్తిని నరికి చంపిన కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ కూకట్‌పల్లిలోని 6వ అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.పావని శుక్రవారం తీర్పు ఇచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగపూరి నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు ప్రాంతానికి చెందిన ఓసూరి చిట్టిబాబు(53) కొండాపూర్‌లోని ఆనంద్‌నగర్‌లోని సుప్రీంమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇతను ఆ ప్రాంతంలోనే కొబ్బరిబొండాలు విక్రయిస్తుంటాడు. ఇదిలాఉంటే అదేప్రాంతానికి చెందిన చిట్బోరి మహేశ్వర్‌రావు(54) 2022లో కొండాపూర్ ప్రాంతానికి వచ్చి అదే హాస్టల్‌లో నివాసముంటూ కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తున్నాడు. వీరిద్దరి మధ్య కొబ్బరిబొండాలు అమ్మే విషయంలో తరచూ గొడవలు జరిగేవి. కాగా.. 2022 ఏప్రిల్ 19న రాత్రి వారు నివాసముండే హాస్టల్‌లోని గదిలో చిట్టిబాబు, మహేశ్వర్‌రావు మధ్య గొడవ జరగడంతో చిట్టిబాబు కొబ్బరికాయలు కొట్టే కత్తితో మహేశ్వర్‌రావు కాలి తొడపై నరికాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఆయన్ను స్థానికులు కొండాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. ఈమేరకు మృతుడి కుమారుడు అంజిబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశారు. కేసులో నిందితుడైన చిట్టిబాబును కోర్టులో హాజరుపర్చారు. కేసును విచారించిన న్యాయమూర్తి చిట్టిబాబును దోషిగా నిర్ధారిస్తూ 10ఏళ్ల జైలు శిక్షతోపాటు 2వేల జరిమానా విధిస్తూ తీర్పు విడుదల చేశారు.

అధిక వడ్డీ ఆశచూపి మోసం

హైదర్‌నగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులపాలైన ఓ వ్యక్తి బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో ఫైనాన్స్ సంస్థ ద్వారా వస్తువులు ఇప్పించి మోసం చేసిన ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు అతడిని కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్టాప్ సమీపంలో నివాసం ఉంటున్న శ్రీనివాస్ ఐస్‌క్రీమ్ డిస్ట్రిబ్యూటర్‌గా వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో కొంతమంది తెలిసిన వ్యక్తులకు బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో ఫైనాన్స్ ద్వారా వస్తువులు ఇప్పించేవాడు. తిరిగి వాటిని శ్రీనివాస్ తీసుకొని వస్తువుకు ఉన్న విలువను తిరిగి కొనుగోలు చేసిన వారికి ఇచ్చి ఈఎంఐలు వాళ్లచేత కట్టించేవాడు. తర్వాత వారికి ఎక్కువ మొత్తంలో వడ్డీలు ఇప్పించేటట్లుగా వారి వద్ద నుంచి నగదు తీసుకుని నమ్మించేవాడు. సుమారు 30 మంది బాధితుల వద్ద నుంచి లక్షల్లో నగదు అధిక వడ్డీ ఆశచూపి వసూలు చేశాడు. వారికి వడ్డీలు చెల్లించకపోవడంతో తాము మోసపోయినట్లుగా గుర్తించి బాధితులు శుక్రవారం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ సైతం తనను వ్యాపారం చేసుకోకుండా చంపేస్తామని బాధితులు బెదిరిస్తున్నారని, అప్పులు చేసిన మాట వాస్తవమేనని పోలీసులతో పేర్కొన్నాడు. అయితే ఎవరి వద్ద ఎంత నగదు ఎంత వడ్డీకి తీసుకున్నాడో విచారణ చేసిన అనంతరం శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని వేధింపులు

యూసుఫ్‌గూడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుని ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని డబ్బులు తీసుకుని వేరే మహిళలతో ఫోన్ చేయించి వేధిస్తున్నాడని ఓ మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కదులూరి కనకమహాలక్ష్మి, బిల్లాకుర్తి అప్పారెడ్డి ప్రేమించుకున్నారు. గతేడాది ఆగస్టులో వివాహం చేసుకుని మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. వివాహం అయిన నెల తర్వాత తనకు ఆర్థిక ఇబ్బందులు వచ్చాయని రూ.30లక్షలు కావాలని అప్పారెడ్డి కనకమహాలక్ష్మిని అడిగాడు. ఆమె స్నేహితులు, బంధువుల వద్ద అప్పు తీసుకుని, బంగారం తాకట్టు పెట్టి క్రెడిట్ కార్డు ఉపయోగించి మొత్తం రూ.15 లక్షలు ఇచ్చింది. డబ్బులు తీసుకున్నాక ఆర్థిక ఇబ్బందులు పోవాలంటే చైనాకు వెళ్తానని చెప్పి 29-3-2024న వెళ్లాడు. అతడు వెళ్లిన రెండు రోజులకు మృదుల బండారు అనే మహిళ ఫోన్ చేసి అప్పారెడ్డి తన భర్త అని, ఐదు సంవత్సరాల బాబు ఉన్నాడని చెప్పింది. వెంటనే అప్పారెడ్డికి ఫోన్ చేసి అడగగా అది అబద్ధం అని, ఆమె నంబర్ బ్లాక్ చేయమని చెప్పాడు. నెల రోజులకు శ్రీకర్ సీత అనే మహిళ ఫోన్ చేసి అప్పారెడ్డి మోసగాడని, అతడిని వదిలేయాలని బెదిరించింది. దీంతో ఈ మహిళలు అప్పారెడ్డితో ఉండి తనను మోసం చేస్తున్నారని, న్యాయం చేయాలని కనకమహాలక్ష్మి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

